సాక్షి మహబూబాబాద్

సోమవారం । 5 । ఫిబ్రవరి । 2024

మేడారంలో సారలమ్మ గద్దె వద్ద కిక్కిరిసిన భక్త జనం



వనం.. జనం

మేడారానికి పోటెత్తిన భక్తులు

వనం.. జనసంద్రమైంది. చెట్టు.. పుట్ట.. వాగు, వంక.. ఎక్కడ చూసినా మేడారంలో భక్తజన ప్రవాహమే కనిపించింది. ఆదివారం తల్లుల దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. తొలుత జంపన్నవాగులో పుణ్య స్నానాలు ఆచరించి వనదేవతల సన్నిధికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సుమారు 3 లక్షల మంది అమ్మవార్లను దర్శించుకున్నట్లు అధికారులు తెలిపారు. – ఎస్‌ఎస్ తాడ్వాయి

- వివరాలు 8లో▸



తల్లులకు మొక్కుతున్న భక్తురాలు



బంగారం(బెల్లం) మొక్కుతో వస్తూ..

న్యూస్‌రీల్

ప్రశాంతంగా సీఓఈ పరీక్ష



మహబూబాబాద్ అర్బన్: జిల్లా వ్యాప్తంగా సోషల్ వెల్ఫేర్ గురుకుల ఇంటర్ కళాశాలల్లో మొదటి సంవత్సరంలో ప్రవేశానికి నిర్వహించిన సీఓఈ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని జిల్లా కో ఆర్డినేటర్ జి.జయలక్ష్మి ఆదివారం తెలిపారు. ఇనుగుర్తి, మానుకోట, తొర్రూరు, మరిపెడ, నర్సింహులపేటలో నిర్వహించిన పరీక్షకు 2,490 మంది విద్యార్థులకు 2,414 మంది హాజరై 76 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించాలి



తొర్రూరు: కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బరిగెల నారాయణ కోరారు. తొర్రూరు జూనియర్ కాలేజీ అధ్యాపకుడు నారాయణ ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండలో రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కాంట్రాక్టు అధ్యాపకులు మర్యాదపూర్వకంగా కలిశారు. అధ్యాపకుల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్లను మంత్రి చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం అధ్యాపకుల సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. నారాయణ మాట్లాడుతూ.. పలు సాంకేతిక కారణాలతో అనేకమంది కాంట్రాక్టు అధ్యాపకులు రెగ్యులర్ కాకుండా మిగిలిపోయారన్నారు. జనరల్ కాలేజీల్లో 21మంది, వొకేషనల్ కళాశాలల్లో 411 మంది కాంట్రాక్టు అధ్యాపకులు రెగ్యులర్ కాకుండా మిగిలిపోయారని, వారి సర్వీసులను వెంటనే క్రమబద్ధీకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మాచర్ల కరుణాకర్, జనార్దన్, బన్న ఐలయ్య, భూక్య రాజు, కిషన్, రాము తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఎంబీఏ మూడవ సెమిస్టర్ పరీక్షలు(రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) పరీక్షలు ఈనెల 5వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 5, 7, 9, 12,14, 16, 19 తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలుంటాయని పేర్కొన్నారు.

పనులు వేగంగా పూర్తిచేయాలి

ఏటూరునాగారం: మేడారం జాతర సందర్భంగా చేస్తున్న అభివృద్ధి పనులు నాణ్యతతో వేగంగా పూర్తి చేయాలని ఐటీడీఏ పీఓ అంకిత్ అన్నారు. ఆదివారం ఆయన మేడారంలో పలు అభివృద్ధి పనులను తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ అదనపు డైరెక్టర్ సర్వేశ్వర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. మేడారంలోని చిలకలగుట్ట వద్ద జరుగుతున్న వర్చువల్ పెయింటింగ్ పనులు, ఊరట్టం వద్ద పూర్తయిన లోలెవల్ బ్రిడ్జిని పరిశీలించారు. ముఖ్యంగా చిన్నబోయినపల్లి, చల్వాక నుంచి కొండాయి, ఊరట్టం మీదుగా మేడారం రావటానికి ఈ లోలెవల్ బ్రిడ్జి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. జంపన్న వాగు పరిసరాలలో భక్తులు పుణ్య స్నానాలు చేయటానికి ఇరిగేషన్ అధికారులు ఏర్పాటు చేసిన షవర్ బ్యాటరీ ఆఫ్ టాప్స్‌ను పరిశీలించారు. భక్తులకు తాగునీటి సమస్య ఏర్పడకుండా తీసుకుంటున్న జాగ్రత్తలను పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు.

క్షేత్ర స్థాయిలో సమస్యల పరిష్కారం

- సీజీఆర్‌ఎఫ్ ఇన్‌చార్జ్ చైర్మన్ కె.తిరుమల్‌రావు

హన్మకొండ: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి లోకల్ కోర్టులు నిర్వహిస్తున్నట్లు టీఎస్ ఎన్పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక(సీజీఆర్‌ఎఫ్) ఇన్‌చార్జ్ చైర్మన్ కె.తిరుమల్‌రావు తెలిపారు. ఈనెల 6న వరంగల్ శంభునిపేట సబ్ డివిజన్ పరిధి, 7న స్టేషన్‌ఘనపూర్ సబ్‌డివిజన్ పరిధి శివునిపల్లి సబ్ స్టేషన్‌లో, 8న కేసముద్రం సబ్ డివిజన్ పరిధి ఇనుగుర్తి సబ్ స్టేషన్‌లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు లోకల్ కోర్టులు నిర్వహిస్తున్నామని, విద్యుత్ వినియోగదారులు ఫిర్యాదు చేసి సమస్యలు పరిష్కరించుకోవచ్చని ఒక ప్రకటనలో సూచించారు.

గ్రామాలే దేశానికి పట్టుగొమ్మలు



సర్పంచ్‌లను సన్మానించిన ఎమ్మెల్యే మురళీనాయక్

- మానుకోట ఎమ్మెల్యే మురళీనాయక్
- మాజీ సర్పంచ్‌లకు సన్మానం

మహబూబాబాద్ రూరల్: గ్రామాలే దేశానికి పట్టుగొమ్మలని, గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకమని మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్ నియోజకవర్గ పరిధిలో ఇటీవల పదవీవిరమణ పొందిన పలువురు మాజీ సర్పంచ్‌లను ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం తండాలను జీపీలుగా మార్చి.. అభివృద్ధికి నిధులు ఇవ్వలేదని ఆరోపించారు. కేంద్రం నిధులు మాత్రమే వచ్చాయని, అభివృద్ధి పనులు చేయాలని చెప్పి సర్పంచ్‌లను అప్పుల పాలు చేశారని విమర్శించారు. చేసిన పనులకు బిల్లులు రాక పోగా సస్పెండ్ అవుతారని బెదిరించారన్నారు. రానున్న ఎన్నికల్లో రెట్టింపు ఉత్సాహంతో కాంగ్రెస్ పార్టీ కోసం పని చేయాలని సూచించారు. ప్రజల మద్దతు ఉన్న వారికే సర్పంచులుగా పోటీ చేసే అవకాశం ఇస్తారన్నారు. నిత్యం ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించే విధంగా గ్రామాల్లో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్ రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్ రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి చుక్కల ఉదయ్ చందర్, కాంగ్రెస్ అర్బన్, మండల అధ్యక్షులు ఘనపురపు అంజయ్య, మిట్టకంటి రాంరెడ్డి, కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వెన్నం లక్ష్మారెడ్డి, టీపీసీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుగులోత్ దస్రునాయక్ పాల్గొన్నారు.

కాల్వలు.. అధ్వానం



సంగళ్ల కాల్వలో పేరుకుపోయిన చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు



పిచ్చిమొక్కలతో నిండిన బోదెపంపు కాల్వ

- ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోని గార్ల పెద్దచెరువు పంట కాల్వలు
- చివరి భూములకు అందని నీరు.. ఎండిపోతున్న వరిపంట
- రైతుల గోడు పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు

గార్ల: గార్ల పెద్ద చెరువు పంట కాల్వలు అధ్వానంగా మారాయి. కాల్వలు ధ్వంసం కావడం, ముళ్లపొదలు, చెత్తాచెదారం, పూడిక పేరుకుపోవడంతో ఆయకట్టు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏటా ఆయకట్టు చివరి భూములకు నీరు అందక పంటలు ఎండిపోయి నష్టపోతున్నామని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వచ్చే వానాకాలం సీజన్ వరకైనా ఇరిగేషన్ అధికారులు పంట కాల్వల మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

2,500 ఎకరాలు..

గార్ల పెద్దచెరువు ఆయకట్టు కింద వానాకాలంలో 2,500 ఎకరాల్లో వరిపంట సాగవుతుంది. ఈ చెరువుకు నాలుగు తూములు ఉన్నాయి. చింతముత్తిగాని తూము, మైసుతూము, సున్నం తూము, సంగళ్ల తూములు ఉన్నాయి. వాటి నుంచి పంటలకు నీళ్లు వెళ్లే కాల్వలు చెత్తాచెదారం, పూడికతో నిండిపోయాయి. దీంతో ఆయకట్టు భూములకు సక్రమంగా నీరందక రైతులు పడరానిపాట్లు పడుతున్నారు. వానాకాలం, యాసంగిలో ఆయకట్టు చివరి భూముల రైతులు నీళ్ల కోసం రాత్రుళ్లు సైతం తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నారు.

రూ.కోటి మంజూరు..

పదేళ్ల క్రితం గార్ల చెరువు, పంట కాల్వలు మరమ్మతుల కోసం రూ.కోటి నిధులు మంజూరయ్యాయి. నాడు సదరు కాంట్రాక్టర్ తూతూమంత్రంగా పనులు నిర్వహించి వదిలేశాడు. చెరువు కట్టతో పాటు పంట కాల్వలు మరమ్మతులు చేపట్టాల్సి ఉండగా చెరువుకట్ట పనులు చేపట్టి కాల్వలను విస్మరించి బిల్లులు డ్రా చేసుకున్నాడని ఆయకట్టు రైతులు పేర్కొన్నారు. ఫలితంగా చెరువులో సమృద్ధిగా నీరు ఉన్నప్పటికీ ఆయకట్టు చివరి భూముల్లో పంటలు ఎండుతున్నాయి.

కాల్వలు ఇలా..

సంగళ్ల కాల్వపై రెండుచోట్ల అసంపూర్తిగా డ్రాప్‌లను నిర్మించి వదిలేశారు. సేరుమిట్ట పంటకాల్వ డ్రాప్‌ను సైతం స్లాబ్ వేయకుండానే వదిలేశారు. రామ్‌దయాల్, బోదెపంపు, ఉసిరికపంపు పంటకాల్వలు సైతం మరమ్మతులు చేయకుండానే వదిలేశారు.ఈ క్రమంలో కాల్వలు ముళ్లకంప, పూడికతో నిండిపోయాయి. మైసుకాల్వ, చింతముత్తిగాని తూముల కింద కాల్వలు మరికొద్ది రోజుల్లో ఆనవాళ్లు కోల్పోయే పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉండగా ఏటా రైతులే డబ్బులు జమ చేసుకొని నామమాత్రంగా కాల్వల మరమ్మతులు చేపట్టుకొని పంటలు పండించుకున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్‌శాఖ అధికారులు స్పందించి వచ్చే వానాకాలం సీజన్ వరకైనా పంట కాల్వలకు మరమ్మతులు చేపట్టి డ్రాప్‌లు నిర్మించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

మరమ్మతులు చేపట్టడం లేదు..



గార్ల పెద్దచెరువు పంట కాల్వలకు 10ఏళ్లుగా మరమ్మతులు చేపట్టకపోవడంతో పంట భూములకు నీరందడం లేదు. పూడికపేరుకుపోయి ఆయకట్టు చివరి పొలాలు ఎండిపోతున్నాయి. మరమ్మతులు చేపట్టి రైతుల సమస్యలు తీర్చాలి.

- కందునూరి మహేశ్వరరావు, గార్ల

ఆయకట్టు చివరి పంటలు ఎండిపోతున్నాయి



పంట కాల్వలు, చెరువు తూముల్లో పూడిక పేరుకుపోవడంతో ఏటా ఆయకట్టు చివరి భూములు ఎండిపోతున్నాయి. దీంతో రైతులు పంట చేతికొచ్చే దశలో వరిపంట ఎండిపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నా. సంబంధిత ఇరిగేషన్ అధికారులు స్పందించి వచ్చే వానాకాలం నాటికి పంట కాల్వలు మరమ్మతులు చేపట్టాలి.

-ఏదునూరి కుమారస్వామి, గార్ల

వానాకాలం వరకు మరమ్మతులు

పంట కాల్వల పూడికతీత, మరమ్మతులు చేపడతాం. వానాకాలం వరకు పూర్తి చేసి రైతులకు సాగు నీరు అందిస్తాం. రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

వంశీ, ఏఈ, ఇరిగేషన్

కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం!

- తూతూమంత్రంగా రోడ్ల నిర్మాణాలు
- మానుకోటలో నాసిరకం మెటీరియల్‌తో పనులు
- నాణ్యత లేకపోవడంతో పాడైపోతున్న రోడ్లు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ



నాసిరకం మెటీరియల్‌తో నిర్మాణం చేసిన బీటీ రోడ్డు



రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న ఏఈ సురేష్

మహబూబాబాద్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలో రోడ్ల నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదు. కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరించి నాణ్యతతో పనులు చేపట్టకపోవడంతో నెలరోజుల్లోనే రోడ్లు పాడైపోతున్నాయని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. నిబంధనలకు తూట్లు పొడిచి నాసిరకం మెటీరియల్‌తో పనులు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపంతోనే నాసిరకం పనులు జరుగుతున్నాయి. కాగా అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని, బిల్లులు నిలిపివేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

కౌన్సిలర్ల వాగ్వాదం..

మానుకోట మున్సిపాలిటీ పరిధిలో పలు వార్డుల్లో రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. కాగా డబుల్ బెడ్రూం ఇళ్లకు వెళ్లే దారిలో వేసిన రోడ్డు నాసిరకంగా ఉందని, బిల్లులు నిలిపివేయాలని ఇటీవల జరిగిన మున్సిపల్ సాధారణ సమావేశంలో పలువురు కౌన్సిలర్లు అధికారులతో వాగ్వాదం చేశారు. కొంతమంది కాంట్రాక్టర్లు కాసులకు కక్కుర్తి పడి నాసిరకం మెటీరియల్ వాడుతున్నారని, సీసీరోడ్లకు క్యూరింగ్ చేయడం లేదని ఆరోపించారు. ఇదిలా ఉండగా ప్రజలకు ఉపయోగం లేనిచోట రోడ్లు వేస్తున్నారని మండిపడ్డారు. అలాగే రోడ్డు నిర్మాణం చేయకుండానే ఓ కాంట్రాక్టర్ బిల్లులు కాజేశాడని పలువురు కౌన్సిలర్లు సమావేశంలో ఆధారాలతో బయటపెట్టినా చర్యలు తీసుకోలేదు. అయితే ఆప్రాంతంలో కాకుండా వేరేచోట రోడ్డు నిర్మాణం చేశాడని అధికారులు కాంట్రాక్టర్‌కు వత్తాసుగా మాట్లాడడం గమనార్హం.

ఓ ప్రాంతంలో ఇలా..

మున్సిపాలిటీ పరిధిలోని సర్వేపల్లి రాధాకృష్ణన్ జంక్షన్ నుంచి ఎల్ఐసీ జంక్షన్, కన్యకాపరమేశ్వరి దేవాలయం జంక్షన్ నుంచి డాక్టర్ స్ట్రీట్ మీదుగా పత్తిపాక రోడ్డు వరకు సుమారు 500మీటర్ల బీటీ రోడ్డు నిర్మాణం చాలా వేగంగా పూర్తి చేశారు. నిర్మాణానికి రూ.90లక్షలు కాగా సదరు కాంట్రాక్టర్ నిబంధనలు పాటించలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. నాసిరకం మెటీరియల్‌తో పనులు చేపట్టినట్లు విమర్శలు వస్తున్నాయి.

పర్యవేక్షణ లోపం..

అధికారుల పర్యవేక్షణ లోపంతో సమారు రూ.కోటి నిధులతో చేపట్టిన పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదు. రోడ్డు సక్రమంగా లేకపోవడంతో పాటు చాలా ప్రాంతాల్లో కంకర తేలి ఉంది. కాంట్రాక్టర్ బిల్లులు నిలిపివేయాలని ఆప్రాంత ప్రజలు కోరుతున్నారు. కాగా ప్రజలు ఆరోపణల నేపథ్యంలో అధికారులు తనిఖీలు చేపట్టారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యత లోపించిందని తేల్చారు. కాగా పలుచోట్ల మళ్లీ పనులు చేపడుతున్నారు.

బిల్లులు నిలిపివేస్తాం..

సర్వేపల్లి రాధాకృష్ణన్ జంక్షన్‌లో చేపట్టిన పనులను పరిశీలించాం. మొదటి లేయర్ పనులు నాణ్యతతోనే పూర్తి చేశారు. రెండో లేయర్ పనులు చూడాల్సి ఉంది. మరోసారి పూర్తిగా తనిఖీలు చేసి అన్ని సక్రమంగా ఉంటేనే బిల్లులు ఇస్తాం. లేకుంటే బిల్లులు నిలిపివేస్తాం.

- సురేష్, మున్సిపల్ ఏఈ

మానుకోట గడ్డపై బీజేపీ జెండా ఎగురవేస్తాం



మాట్లాడుతున్న మార్తినేని ధర్మారావు

మహబూబాబాద్ అర్బన్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మానుకోట గడ్డపై బీజేపీ జెండా ఎగురవేస్తామని పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మహబూబాబాద్, ఖమ్మం, వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గస్థాయి క్లస్టర్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ 400పైగా స్థానాలను కైవసం చేసుకుంటుందని జోస్యం చెప్పారు. బీఆర్‌ఎస్ కనుమరుగవుతుందని, ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ మధ్యనే పోటీ ఉంటుందన్నారు. ఈ నెల 5 నుంచి 8వ తేదీ వరకు చలో గ్రామ అభియాన్, పట్టణాల్లో బస్తీ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యకర్తలు బూత్ స్థాయిలో ఆటో డ్రైవర్లు, గీత కార్మికులు, మాజీ ప్రజాప్రతినిధులు, మహిళలు, యువకులు, విద్యావంతులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగస్తుల వద్దకు వెళ్లి కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలపై వివరించాలన్నారు. అదేవిధంగా ఈ నెల 10నుంచి 16వ తేదీ వరకు 21 అసెంబ్లీ నియోజకవర్గాల్లో బస్సుయాత్ర, బహిరంగ సభలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్రంలోని 17 పార్లమెంట్ స్థానాల్లో విజయం సాధిస్తామన్నారు. అనంతరం నూతన జిల్లా అధ్యక్షుడు యలమంచిలి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా తన నియామకానికి సహకరించిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని, పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానన్నారు. బీజేపీ రాష్ట్ర నాయకులు రాజవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు శశివర్ధన్‌రెడ్డి, నాయకులు రాంబాబు, బుల్లెట్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన త్యాగరాయ కీర్తనలు

హన్మకొండ: హనుమకొండలోని అంబేడ్కర్ భవన్‌లో సద్గురు త్యాగరాజస్వామి 177వ సంగీత ఆరాధనోత్సవం కనుల పండువగా జరిగింది. శ్రీభద్రకాళి దేవస్థాన ప్రధానార్చకుడు శేషు, ఎంజీఎం సూపరింటెండెంట్ చంద్రశేఖర్, నెఫ్రాలజిస్ట్ డాక్టర్ వెంకటరమణ, ప్రముఖ అకౌంటెంట్ త్రిపురనేని గోపీచంద్ అతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ఆరాధనోత్సవాల్ని ప్రారంభించారు. ఈసందర్భంగా విద్యార్థులు ఆలపించిన త్యాగరాయ కీర్తనలు అలరించాయి. కార్యక్రమంలో సప్తస్వర మ్యూజిక్ అకాడమీ నిర్వాహకురాలు స్వరూపారాణి, లాయక్, హైమదా పాల్గొన్నారు.

ఆరోగ్య పరీక్షలు

- 50రోజుల పాటు రక్తహీనత పరీక్షలు
- జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహణ
- గత నెల 24న కార్యక్రమం ప్రారంభం



విద్యార్థినులకు పరీక్షలు చేస్తున్న వైద్య బృందం(ఫైల్)

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు రక్తహీనత పరీక్షలు చేపడుతున్నారు. పాఠశాలస్థాయిలో 8,9,10 తరగతుల విద్యార్థులతో పాటు ఇంటర్ విద్యార్థులకు టెస్టులు చేస్తున్నారు. కాగా రక్తహీనత నిర్మూలనే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఎనిమియా ముక్త్ భారత్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. గత నెల 24 నుంచి వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రీయ బాలస్వస్త్ ద్వారా విద్యార్థులకు పరీక్షలు చేపడుతున్నారు. 50రోజుల పాటు ప్రతీరోజు 10బృందాలు విద్యార్థులకు పరీక్షలు చేస్తారు. ఫలితాల ఆధారంగా చికిత్స అందించనున్నారు.

పాఠశాలలు, కళాశాలలు ఇలా..

జిల్లాలో 10 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఉన్నత పాఠశాలలు 100, కేజీబీవీలు 15, మోడల్ స్కూల్స్ 8, అన్ని గురుకులాలు కలిపి 25 ఉన్నాయి. కాగా సుమారు 2,5200మంది విద్యార్థులకు రక్తహీనత పరీక్షలు నిర్వహించాలని అధికారులు గుర్తించారు. వీరందరికీ ఆయా పాఠశాలలు, కళాశాలల్లోనే పరీక్షలు నిర్వహించేలా కార్యాచరణ రూపొందించారు.

బృందంలో వీరు..

జిల్లాలో పది బృందాలు పనిచేస్తున్నాయి. ఒక్కో బృందంలో ఇద్దరు మెడికల్ ఆఫీసర్లు, ఫార్మసిస్ట్, ఏఎన్ఎంతో పాటు డ్రైవర్‌ను నియమించారు. డిజిటల్ హిమోగ్లోబిన్ మిషన్ ద్వారా శరీరంలో హిమోగ్లోబిన్ శాతాన్ని నిర్ధారిస్తారు. 8శాతం కంటే తక్కువగా ఉంటే రక్తహీనత ఉన్నట్లుగా నమోదు చేసుకుంటారు. వీరికి ఐరన్, పోలిక్ యాసిడ్ మాత్రలను ఉచితంగా అందిస్తారు. 7శాతం కంటే తక్కువగా ఉంటే మోడ్‌లో.. 6శాతం కంటే తక్కువగా ఉంటే తీవ్ర రక్తహీనత ఉన్నట్లు నిర్ధారిస్తారు. ఆ విద్యార్థులకు ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించి రక్తం ఎక్కిస్తారు. మరిన్ని పరీక్షలు చేసి రక్తహీనతకు గల కారణాలను తెలుసుకుంటారు. పరీక్షల్లో కేన్సర్, రక్తహీనత, తలసేమియా, బ్లడ్ కేన్సర్, సికిల్‌సెల్ ఎనిమియా వంటి వ్యాధులు ఉన్నట్లు తేలితే మెరుగైన చికిత్స అందించేందుకు చర్యలు తీసుకుంటారు.

పౌష్టికాహారం తీసుకోవాలి..



పౌష్టికాహార లోపంతో అలసట రావడం, తలతిరగడం, పెరుగుదల లేకపోవడం, ఆకలి ఉండకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇది రక్తహీనతకు దారితీస్తుంది. ప్రోటీన్లు, విటమిన్లు, ఆకుకూరలు, కూరగాయల భోజనం చేయకపోవడంతో ఈ సమస్య తలెత్తుతుంది. రక్తహీనతతో బాధపడుతున్న వారికి మాత్రలు అందిస్తాం.

-డాక్టర్ కుమార్, జిల్లా నోడల్ అధికారి

పరీక్షలకు ముందుకు రావాలి



పిల్లలకు హిమోగ్లోబిన్ పరీక్షలు చేయాలని ఆదేశాలు వచ్చాయి. 12 ఏళ్ల పైబడిన విద్యార్థులకు పరీక్షలు చేసి ప్రభుత్వానికి నివేదికలు అందజేస్తాం. విద్యార్థులకు ఐరన్ లోపంతో కడుపులో నులిపురుగుల వల్ల రక్తహీనత కలుగుతుంది. క్రమంతప్పకుండా ఆల్బెండజోల్ మాత్రలను ఆరు మాసాలకోసారి వేసుకోవాలి.

-డాక్టర్ విజయ కుమార్, ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్

క్లుప్తంగా

డీసీఎం -స్కార్పియో వాహనం ఢీ

● మేడారం వెళ్తున్న భక్తులకు గాయాలు



కాళేశ్వరం: మహదేవపూర్– కాళేశ్వరం జాతీయ రహదారి 353(సీ) మార్గమధ్యలో డీసీఎం – స్కార్పియో వాహనాలు ఢీకొన్న ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా సిరొంచ నుంచి ఆదివారం ఉదయం మేడారం సమ్మక్క– సారలమ్మల దర్శనానికి స్కార్పియో వాహనంలో ఓ కుటుంబం బయలుదేరింది. కాళేశ్వరం సమీపంలోని మలుపు వద్ద ఎదురుగా మహదేవపూర్ నుంచి వస్తున్న డీసీఎం – స్కార్పియో ఢీ కొన్నాయి. ఈ ఘటనలో స్కార్పియో వాహన డ్రైవర్ సురేష్ ఆత్రం, పిడుగు సహస్ర, సాహిత్యలకు స్వల్పగాయాలయ్యాయి. కాళేశ్వరం పోలీసులు గాయాలైన వారిని మహదేవపూర్ సామాజిక ఆస్పత్రికి తరలించి వైద్యసేవలందిస్తున్నారు. కాగా, స్కార్పియో వాహనం ముందు భాగం నుజ్జునుజ్జయింది. కాళేశ్వరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాల్వలోకి దూసుకెళ్లిన కారు

● తప్పిన ప్రమాదం



హసన్‌పర్తి : కారు అదుపు తప్పి ఎస్సారెస్పీ కాల్వలోకి దూసుకెళ్లింది. హనుమకొండ–అంబాల మార్గ మధ్యలోని ముచ్చర్ల శివారులో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. వివరాలు ఇలా ఉన్నాయి. పరకాల మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు పాడి కల్పన, ఆమె భర్త ప్రతాప్‌రెడ్డి, వారి మనవడు, మనవరాళ్లు కలిసి ఆదివారం మధ్యాహ్నం నర్సక్కపల్లి నుంచి అంబాల మీదుగా పరకాలకు బయలుదేరారు. ఈ క్రమంలో కారు మార్గమధ్యలోని ముచ్చర్ల సమీపంలోని డీబీఎం–35 కాల్వలోకి దూసుకెళ్లింది.

తెరుచుకున్న ఎయిర్ బెలూన్స్..

కారు దూసుకెళ్లే క్రమంలో ఎయిర్ బెలూన్స్ తెరుచుకున్నాయి. ఈ ప్రమాదంలో కారులో ఉన్న వారందరూ సురక్షితంగా బయటపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

రెడ్డి చికెన్ సెంటర్
Cell: 9989299661



జంపన్నవాగు షవర్ల వద్ద స్నానాలు చేస్తున్న భక్తులు



గద్దెల వద్ద ప్రసాదం తీసుకుంటున్న భక్తులు



జాతరకు వస్తున్న భక్తులు



గంట కొడుతున్న చిన్నారులు

తరలివచ్చి.. మొక్కులు తీర్చి





సమ్మక్క గద్దెకు వెళ్తున్న భక్తులు



ఎదురుకోళ్లు పడుతున్న భక్తురాలు



బంగారం (బెల్లం)తో భక్తులు



జంపన్నవాగులో మొక్కుతున్న భక్తులు

మేడారానికి పోటెత్తిన భక్తులు

● కిక్కిరిసిన వనదేవతల ప్రాంగణం
● ఉదయం 5 గంటకే గద్దెలకు తాళాలు
● పోలీసుల భారీ బందోబస్తు..
● ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు

ఎస్ఎస్ తాడ్వాయి : మేడారానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం సెలవు రోజు కావడంతో సమ్మక్క, సారలమ్మను దర్శించుకునేందుకు తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు ప్రైవేట్ వాహనాల్లో మేడారానికి భారీగా తరలివచ్చారు. జంపన్నవాగు షవర్ల కింద పుణ్య స్నానాలు ఆచరించి అమ్మవార్ల గద్దెల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల తాకిడి పెరగడంతో అధికారులు గద్దెలకు తాళాలు వేశారు. దీంతో భక్తులు బయట నుంచి కొబ్బరి, బెల్లం, పసుపు, కుంకుమలు గద్దెల పైకి విసిరి మొక్కులు చెల్లించుకున్నారు. సుమారు 3 లక్షల మందికి పైగా భక్తులు తల్లులను దర్శించుకున్నట్లు అధికారులు తెలిపారు. దేవాదాయ శాఖ డీసీ శ్రీకాంత్‌రావు, ఈఓ రాజేంద్రం భక్తుల రద్దీని పర్యవేక్షించారు.

అడవిలో వంటావార్పు

తల్లుల దర్శనం అనంతరం భక్తులు జాతర చుట్టుపక్కల అటవీ ప్రాంతంలోని చెట్ల కింద విడిది చేశారు. మేడారం – తాడ్వాయి 10 కిలోమీటర్లు, మేడారం – వెంగళాపూర్ 12 కిలోమీటర్ల మేరకు భక్తులు అటవీ ప్రాంతంలో చెట్ల కింద వంటావార్పు చేసుకుని ప్రకృతిని ఆస్వాదిస్తూ ఆనందంగా గడిపారు. వేలాది వాహనాలు రోడ్ల వెంట బారులు దీరి కనిపించాయి. అటవీ ప్రాంతం భక్తుల వంటావార్పుతో సందడిగా కనిపించింది. అడవిలోని చెట్టు, పుట్టకు కూడా పసుపు, కుంకుమ పెట్టి అమ్మవార్ల రూపంగా పూజించారు.

అధికారులు అప్రమత్తం..

మేడారానికి భక్తులు ఆదివారం భారీ సంఖ్యలో తరలివస్తారని అధికారులు అంచనా వేసి శనివారం రాత్రి నుంచే పకడ్బందీ చర్యలు చేపట్టారు. పోలీసులు ట్రాఫిక్ జామ్ కాకుండా బారికేడ్లు ఏర్పాట్లు చేసి వాహనాలను దారి మళ్లించారు. పస్రా నుంచి తాడ్వాయి మీదుగా మేడారం, పస్రా నుంచి నార్లాపూర్ మీదుగా మేడారానికి ప్రైవేట్ వాహనాలను మళ్లించారు. ప్రైవేట్ వాహనాలను ఎక్కడికక్కడ నిర్దేశించిన పార్కింగ్ స్థలాల్లో నిలిపివేశారు. కాగా, భక్తుల తాకిడి పెరగడంతో ఆదివారం ఉదయం 5 గంటలకే అమ్మవార్ల గద్దెలకు అధికారులు తాళాలు వేశారు. భక్తులు ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టి, క్యూలైన్ల ద్వారా దర్శనానికి పంపించారు.

ఆర్టీసీ బస్సుల్లో 5 వేల మంది తరలింపు

మేడారానికి ఆదివారం ఆర్టీసీ బస్సుల ద్వారా 5 వేల మందిని తరలించినట్లు అధికారులు తెలిపారు. హనుమకొండ నుంచి 60 బస్సుల్లో సుమారు 5 వేల మంది భక్తులను తరలించారు. ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యంతో వేల సంఖ్యలో మహిళా భక్తులు ఆర్టీసీ బస్సుల ద్వారా మేడారం తరలివచ్చారు. ఫలితంగా భక్తులు, బస్సుల రద్దీతో మేడారం ఆర్టీసీ బస్టాండ్ కళకళలాడింది.

పద్మశ్రీ సమ్మయ్యకు ప్రభుత్వ నజరానా

● రాష్ట్ర సర్కారు నుంచి రూ.25 లక్షల నగదు పారితోషికం
● రూ.25 వేల పింఛన్ ప్రకటన



ప్రశంసలు పొందుతున్న సమ్మయ్య

దేవరుప్పుల: పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైన చిందుయక్షగాన కళాకారుడు గడ్డం సమ్మయ్యను రాష్ట్ర ప్రభుత్వం సత్కరిస్తూ నజరానా ప్రకటించింది. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన పద్మవిభూషన్, పద్మశ్రీ గ్రహీతల సత్కారంలో భాగంగా జనగామ జిల్లా దేవరుప్పుల మండలం అప్పిరెడ్డిపల్లికు చెందిన సమ్మయ్యకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు కృష్ణారావు, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, విప్ వేం నరేందర్‌రెడ్డి, పద్మవిభూషణ్‌లు వెంకయ్యనాయుడు, చిరంజీవీ చేతులమీదుగా రూ. 25 లక్షల నగదు పారితోషికం చెక్కు అందజేశారు. అలాగే, ప్రతి నెలా రూ.25 వేల పింఛన్‌ను ప్రకటించింది. కాగా, కేంద్ర ప్రభుత్వం క్షేత్రస్థాయి పేద కళాకారులకు గుర్తింపు ఇస్తే రాష్ట్ర ప్రభుత్వం పురస్కార కళాకారుల జీవనప్రమాణాల మెరుగు కోసం నగదుతో పాటు ఫించన్ ప్రకటన చేయడంపై సమ్మయ్య హర్షం వ్యక్తం చేశారు. తమకు పింఛన్ రావడానికి కృషి చేసిన కాంగ్రెస్ నాయకుడు వీహెచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వరకట్న వేధింపులకు తల్లీబిడ్డ బలి

● బాలుడితో సహా వివాహిత ఆత్మహత్య
● పర్వతగిరి మండలం అన్నారం చెరువులో ఘటన
● మిల్స్‌కాలనీ స్టేషన్‌లో ఏడుగురిపై కేసు



కుమారుడితో తస్లీమ్ (ఫైల్)

ఖిలా వరంగల్/ పర్వతగిరి: వరకట్నం, శారీరక, మానసిక వేధింపులతో ఓ వివాహిత తన 7నెలల కుమారుడితో సహా వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం అన్నారం చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. శుక్రవారం సాయంత్రం చెరువులో మహిళ మృతదేహం లభ్యం కాగా 7నెలల బాలుడి ఆచూకీ లభించలేదు. మృతురాలి తండ్రి ఎస్.కే అఫ్జల్ ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి, పోస్టుమార్టం అనంతరం మహిళ మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు. 7నెలల బాలుడి ఆచూకీ కోసం వరంగల్ ఏసీపీ బోనాల కిషన్, ఇన్‌స్పెక్టర్ టి.సురేష్ ఆధ్వర్యంలో స్థానిక మత్స్యకారులు, గజ ఈతగాళ్ల సహకారంతో ఆదివారం గాలించగా.. బాలుడి మృతదేహం లభ్యమైంది. కాగా, కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన ఎస్.కె. అఫ్జల్ కుమార్తె తస్లీమ్(23)ను 19నెలల క్రితం వరంగల్ శంభునిపేటకు చెందిన ఎండీ తస్వీర్‌కు ఇచ్చి వివాహం చేశారు. వివాహ సమయంలో రూ.1.50లక్షలు, 3తులాల బంగారం, 26 తులాల వెండి, పల్సర్ బైక్ కోసం రూ.లక్షల ఇవ్వగా ఇంకా రూ.26వేలు ఇవ్వాల్సి ఉంది. పెళ్లి జరిగిన నెల నుంచే అదనపు కట్నం కోసం భర్త తస్వీర్, అత్త అబ్జల్ బీ, మామ మహమూద్, ఆడబిడ్డ తస్లీమా, బావ ఫారూక్, తోటికోడలు షాజహాన్, ఆడబిడ్డ భర్త జాఫర్ శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నాడని మృతురాలి తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈక్రమంలో ఫిబ్రవరి 1న మరో సారి అదనపు కట్నం కోసం భర్త తస్వీర్ కొట్టడంతో తస్లీమ్ అదేరోజు సాయంత్రం 7నెలల కుమారుడితో పర్వతగిరి మండలం అన్నారం దర్గా చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో పర్వతగిరి పోలీసులు గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేసి ఎంజీఎం మార్చురీకి తరలించారు. అయితే మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో అదృశ్యం కేసు నమోదైన వివాహిత తస్లీమ్‌గా గుర్తించి మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు. ఆదివారం అదే చెరువులో ఆమె కుమారుడి మృతదేహం లభ్యమైంది. ఈనేపథ్యంలో తల్లీకుమారుడి మృతికి కారణమైన నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలుస్తోంది. మృతురాలి తండ్రి అఫ్జల్ ఫిర్యాదు మేరకు భర్త తస్వీర్, అత్తామామ, ఆడబిడ్డ, తస్లీమా, బావ ఫారుఖ్, తోటికోడలు షాజహ, ఆడబిడ్డ భర్త జాఫర్‌తో కలిపి ఏడుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ సురేష్ తెలిపారు.



అన్నారం చెరువులో మరబోట్లతో గాలిస్తున్న ఇన్‌స్పెక్టర్ సురేష్, మత్స్యకారులు

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

■ హౌస్, ఫ్లాట్, వ్యవసాయ భూములు మార్టిగేజ్ చేసుకొని వారంలో అమౌంట్ ఇప్పించబడును. జెటిసోర్సింగ్, కాంట్రాక్ట్ వారికి చేయబడును. సెల్: 7842279342, హన్మకొండ. [WA-7283]

FINANCE SERVICES

■ సిరి అసోసియేట్స్ అన్ని రకాల రుణాలు, పర్సనల్ హౌసింగ్ మార్ట్ గేజ్ ఓపెన్ ప్లాట్స్ పై కూడా సివిల్ ప్రాబ్లం ఉన్న చేయించబడును. సంప్ర: సెల్: 9666142226 [W-788988]

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

■ మీయొక్క సెప్టిక్ ట్యాంక్స్ నిండినవా? నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్పర్ మిషన్ ద్వారా మీ సెప్టిక్ ట్యాంక్స్ క్లీన్ చేయబడును. సంప్ర॥ డి.యస్. రావు, సెల్: 9849145043. [W-788992]

BUSINESS OFFER

■ Sri Avani Eco-Life Pvt Ltd. తక్కువ పెట్టుబడితో వ్యాపారాన్ని ప్రారంభించండి. ప్లాస్టిక్ కవర్లకు బదులుగా * బయో డిగ్రేడబుల్* కవర్లను మార్కెటింగ్ చేయుటకు మండలాల వారీగా డీలర్లు కావలెను. ఫోన్: 9493786468, 6301041696. [H-801665]

■ కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రాజెక్టును అందిస్తుంది. వ్యక్తిగత, విద్య, టేక్ ఓవర్ అగ్రికల్చర్ ఏజెంట్ కావలెను. DMA Welcome, Salary + కమీషన్ ఆఫీసు, ఖర్చులు, ✆ 9773917835. [T-1261198]

WANTED

■ Wanted female telecallers and business associate for Real Estate layouts for details. Contact: 7997777377 [W-788990]

■ Govt (Regd) సంస్థ తరఫున Work చేయుటకు సొంత కంప్యూటర్ గలవారు కావలెను. ఇంటి దగ్గరే వర్క్ చేస్తూ 9 to 19K వరకు సంపాదించే అవకాశం. సెల్: 8977429273. [W-788986]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్. మీ పేరు, అడ్రస్ కాల్ /వాట్సప్ చేయగలరు. 91777 36926. [M-1233772]

తాజా వార్తల కోసం లాగాన్ అవ్వండి www.sakshi.com

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520, 9059633520. [M-1167515]

■ ఒమేగా హోమ్‌కేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు ఇంటి పని, వంట పని చేయుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీ: 20k ఫోన్: 8977639662, 8977639663. [H-793685]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/-రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

చిట్‌ఫండ్ ఏజీఎం ఆత్మహత్య

కాజీపేట : హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో కనకదుర్గ చిట్‌ఫండ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ నల్ల భాస్కర్ రెడ్డి (35) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సుబేదారి పోలీసుల కథనం ప్రకారం.. నగరంలోని ఎక్సైజ్ కాలనీకి చెందిన భాస్కర్ రెడ్డి కొంతకాలంగా కనకదుర్గ చిట్ ఫండ్‌లో పనిచేస్తున్నారు. ఈ క్రమంలో అనేక మంది పరిచయస్తుల నుంచి డిపాజిట్లు సేకరించి సంస్థలో జమచేయించాడు. తిరిగి చెల్లింపులు చేయడానికి చిట్‌ఫండ్ యాజమాన్యం సహకరించకపోవడంతో డిపాజిట్‌దారుల ఒత్తిడి పెరిగింది. దీంతో ఒత్తిడి తట్టుకోలేక హరిత హోటల్‌లో ఆదివారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హోటల్ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. కాగా, చిట్‌ఫండ్ యాజమాన్యం వైఖరి వల్లే తన భర్త మృతిచెందాడని మృతుడి భార్య షామిలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నామని పోలీసులు తెలిపారు.

కుటుంబ కలహాలతో చిన్నకిష్టాపురంలో యువకుడు..

గార్ల: కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెందిన ఓ యువకుడు ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. మానుకోట జిల్లా గార్ల మండలంల చిన్నకిష్టాపురం గ్రామంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నకిష్టాపురం గ్రామానికి చెందిన పూనెం రాజ్‌కుమార్(28) కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపానికి గురైన రాజ్‌కుమార్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై మృతుడి తల్లి పూనెం సంతోషి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జీనత్‌కుమార్ తెలిపారు.

లైంగికదాడి కేసులో వ్యక్తి అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

చిట్యాల: వివాహితపై లైంగికదాడికి పాల్పడిన కేసులో రేగొండ మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ బైకాని రాజేందర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ దాసారపు వేణుచందర్ ఆదివారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. రేగొండ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బైకాని రాజేందర్ ఓ వివాహితకు తెలియకుండా ఫొటోలు, వీడియోలు తీసి అందరికీ చూపిస్తానని బెదిరించేవాడు. దీంతో వివాహిత చిట్యాల మండలంలోని తన తల్లిగారింటికి వచ్చింది. ఈ క్రమంలో రాజేందర్ ఆమెను వెంబడించి తనతో రావాలని, లేకుంటే ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో పెడతానని బెదించి, వెంట తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. విషయం ఎవరికైనా చెబితే మీ కుటుంబ సభ్యులను చంపివేస్తానని బెదించాడు. ఆ తర్వాత వేములవాడ, బాసర, కామారెడ్డి తదితర ప్రాంతాలకు తనతో తీసుకెళ్లాడు. ఈ క్రమంలో తనకు ప్రాణహాని ఉందని గమనించిన వివాహిత నిందితుడి నుంచి తప్పించుకుని చిట్యాల మండలంలోని తల్లిగారింటికి చేరుకుంది. జరిగిన సంఘటనపై వివాహిత తల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు రాజేందర్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై జంగిలి రమేష్, కానిస్టేబుళ్లు లాల్ సింగ్, సిద్ధార్థ, రంజిత్‌ను సీఐ వేణుచందర్ అభినందించారు.

తెగులు.. దిగులు



పూతకు సోకిన తేనెమంచు తెగులు



పూతకు సోకిన బ్యాక్టీరియా ఆకు మచ్చ తెగులు

మామిడి పంటకు తెగుళ్ల బెడద

● పూత దశలో తోటలు
● ఆందోళనలో యజమానులు
● సస్యరక్షణ చర్యలు తీసుకోవాలంటున్న శాస్త్రవేత్తలు

కరీమాబాద్: మామిడిని తెగుళ్ల బెడద వెంటాడుతోంది. తోటలు ప్రస్తుతం పూత దశలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో పంటను తెగుళ్లు ఆశిస్తున్నాయి. ఫలితంగా తోటల యజమానులు, కౌలు రైతులు ఆందోళన చెందుతున్నారు. డిసెంబర్‌లో ప్రారంభమయ్యే పూత దశ ఫిబ్రవరి వరకు కొనసాగనుంది. అయితే తోటలకు సంబంధించిన 'పూత'ను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సమగ్ర సస్యరక్షణ చర్యలు తీసుకుంటే తెగుళ్ల బారి నుంచి పంటను రక్షించుకోవచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

తెగుళ్లను ప్రారంభంలోనే నియంత్రించాలి..

మామిడి చెట్లకు పూత మొదలవగానే ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ తెగుళ్ల ఆనవాళ్లు కనపడగానే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. వాతావరణంలో వస్తున్న మార్పులకనుగుణంగా శాస్త్రవేత్తలు, ఉద్యాన శాఖ అధికారులను సంప్రదిస్తూ వారి సలహాలు, సూచనలు పాటించాలి. పూత దశలో వచ్చే తెగుళ్లను ముందుగా గుర్తించాలి.

మామిడిలో వచ్చే తెగుళ్లు ఏవంటే..

మామిడి తోటలు పూత దశలో ఉన్నప్పుడు ఎక్కువగా బూడిద, నల్లమచ్చ తెగుళ్లు, తేనెమంచు, తామర, పూత పురుగులు వస్తుంటాయి. అవి పూతకు సోకితే కాయ దిగుబడి తగ్గే అవకాశం ఉంటుంది.

బూడిద తెగులు.. నివారణ చర్యలు..

మామిడి పూత దశలో ఉన్నప్పుడు వాతావరణం రాత్రి పూట చల్లగా, పగటి పూట వెచ్చగా ఉన్నప్పుడు ఈ తెగులు ప్రభావం ఎక్కువగా కనిపిస్తుంది. దీంతో పూత కాండం, పూత, పిందెలపై పొడి లాంటి బూజు పదార్థంగా చేరడంతో పూత, కాత రాలిపోతుంది. ఈ తెగులు నివారణ కోసం మొగ్గలు కనిపించే దశలో మొతాదును బట్టి గంధకం, హెక్సకోనాజోల్, ప్రొపికోనాజోల్, డినోకాఫ్, ట్రైడిమార్ఫ్ మందులు పిచికారీ చేయాలి.

నల్లమచ్చ తెగులు..నివారణ..

పొగమంచు ఎక్కువగా ఉన్న సమయంలో ఈ తెగులు విజృంభిస్తుంది. ఇది మొదట లేత ఆకులు, పూలను ఆశించడంతో ఆకుల మీద గోధుమ రంగులో మచ్చలు ఏర్పడి ఆకులు పండుబారి రాలిపోతాయి. రెమ్మలపై కూడా నల్లని మచ్చలు ఏర్పడి పూతగుత్తులు, పూలు మాడిపోయి కాయలు రాలిపోతాయి. నివారణ కోసం పూత దశకు ముందే ఎండిన కొమ్మలను కత్తిరించి తగులబెట్టాలి. కాపర్ ఆక్సీక్లోరైడ్, బోర్డో కలిపి పిచికారీ చేయాలి. కార్బండిజం, థయోఫినేట్ లాంటి మందులు మోతాదు ప్రకారం పిచికారీ చేయాలి.

తేనె మంచు పురుగు..నివారణ..

మామిడిలో తల్లి, పిల్ల పురుగులు గుంపులుగా చేరి లేత ఆకులు, పూత కాండాలు,పూలు, లేత పిందెల నుంచి రసం పీల్చడంతో ఆకుల చివర్లో మాడిపోయి పూత మాడిపోవడమే కాకుండి పిందెలు రాలిపోతాయి. ఆకులు, కాండం, కాయలపై మసి పొర ఏర్పడుతుంది. నివారణ కోసం మోనోక్రోటోఫాస్, డైక్లోరవాస్, డైమెథోయేట్, జిథైల్‌డెమటాన్, ఇమిడాక్లోప్రైడ్ లాంటి మందులు మోతాదు ప్రకారం పిచికారీ చేయాలి.

మామిడి పూత దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు..



మామిడిపూత

మామిడి చెట్లు ఉన్న భూమిలో తేమ కోసం పూత వచ్చిన తర్వాత ప్రతి 10–15 రోజులకు ఒకసారి నీరు పెట్టాలి. చలి ఎక్కువగా ఉంటే పూత రావడం ఆలస్యమవుతుంది. అందుకే పొటాషియం, నైట్రేట్, యూరియా మోతాదు ప్రకారం కలిపి పిచికారీ చేయాలి. పూత సమయంలో కొమ్మ కత్తిరించడం, దున్నడం లాంటి పనులు చేయొద్దు.

పూత పురుగు..నివారణ..


మామిడిలో ఈ పురుగు అరుదుగా కనిపిస్తుంది. తల్లి పురుగు గుడ్లు పెట్టడం ద్వారా వచ్చిన పిల్ల పురుగులు పూల కాడలోకి చొచ్చుకుపోయి కాడ భాగాన్ని తినడంతో పూల కాడలు వంగిపోయి, ఎండిపోయి పూత రాలిపోతుంది. నివారణ కోసం మోనోక్రోటోఫాస్, ఎసిఫేట్, పాస్ఫమిడాన్, డైక్లోరవాస్ లాంటి మందులు అవసరం మేరకు పిచికారీ చేయాలి.

తామర పురుగు..నివారణ..

మామిడి పంట పూత సమయంలో తామర పురుగు రసం పీల్చడంతో పూత ఎండిపోయి రాలిపోతుంది. ఇది మామిడితోపాటు మిరప పంటలను కూడా నష్టపరుస్తుంది. తామర.. మంచు పురుగులు, మంగు తెగులును వ్యాప్తి చెందేలా చేస్తుంది. నివారణ కోసం ఇమిడాక్లోప్రైడ్, థయామితగ్జాం లాంటి మందులు మోతాదు ప్రకారం పిచికారీ చేయాలి.

రైతులు పూతను గమనించాలి..

మామిడి పూత దశలో ఉంది. ఈ నేపథ్యంలో రైతులు ఎప్పటికప్పుడు పూతను గమనించాలి. పూత, కాండంలను పరిశీలిస్తూ సమగ్ర సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి. పూతలో ఎలాంటి మార్పులు కనిపించినా వెంటనే ఉద్యాన శాఖ అధికారులు, శాస్త్రవేత్తలను సంప్రదించి వారి సలహాలు, సూచనలు పాటించాలి. అవసరమైన మందులు పిచికారీ చేసి మామిడి పంటను రక్షించుకోవాలి.



డాక్టర్ రాజు, శాస్త్రవేత్త, కేవీకే మామునూరు